# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 58 10-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06








# గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతున్నాం

- నంద్యాల జిల్లా కొత్త బురుజులో రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణీ
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో గత ప్రభుత్వం భూములు లాక్కునే ప్రయత్నం చేసిందన్న సీఎం
- రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా క్యూఆర్ కోడ్, బ్లాక్ చైన్ టెక్నాలజీతో కొత్త పాస్‌పుస్తకాలు
- కేంద్ర సాయంతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని వెల్లడి
- గత ప్రభుత్వంలా విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపబోమని స్పష్టీకరణ



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నంద్యాల జిల్లా కొత్త బురుజు గ్రామంలో రైతులకు కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోందని స్పష్టం చేశారు. గత పాలకులు రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించారని, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో రైతులు, పేదల భూములను లాక్కునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపులు, అక్రమ ఆక్రమణల కోసమే గత ప్రభుత్వం 1.95 కోట్ల ఎకరాలను సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టిందని సీఎం మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసి, రికార్డుల్లోని తప్పులను సరిచేస్తున్నామని చెప్పారు. గత పాలకులు పాస్ పుస్తకాలపై, సర్వే రాళ్లపై తమ ఫోటోలు వేసుకుని రూ.750 కోట్లు వృథా చేశారన్నారు. రైతుల సమక్షంలోనే కొలతలు వేసి, వారి ఆమోదంతోనే ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా కొత్త పుస్తకాలు ఇస్తున్నట్లు వివరించారు. క్యూఆర్ కోడ్, బ్లాక్ చైన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని,

2లో

# చమురు నిల్వలే లక్ష్యం!

## తీవ్రస్థాయిలో ప్రతి చర్యలకు దిగిన ఇరాన్



- గల్ఫ్ దేశాల్లోని చమురు కేంద్రాలపై దాడులు
- మంటల్లో యూఏఈ, బహ్రెయిన్ క్షేత్రాలు
- ఖమేనీ వారసునిగా కుమారుడు మొజ్తబా
- సుప్రీం నేతగా ఎన్నుకున్న మత పెద్దల కమిటీ
- భారతీయులెవరూ మరణించలేదు: సౌదీ
- ఇజ్రాయెల్‌లో ఓ భారతీయునికి గాయాలు

దుబాయ్: పశ్చిమాసియాలో పోరు బీభత్సం కొనసాగుతూనే ఉంది. ఇరాన్ చమురు నిల్వలపై దాడుల తీవ్రతను ఇజ్రాయెల్ మరింతగా పెంచింది. ఆదివారం 4 కేంద్రాలపై దాడులు చేయగా సోమవారం ఏకంగా 30 చమురు నిల్వ డిపోలపై బాంబుల వర్షం కురిపించింది. దాంతో ఎక్కడ చూసినా భారీగా మంటలు చెలరేగి భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. ఇరాన్



# మనోళ్ల భద్రతే ముఖ్యం

- పశ్చిమాసియా కల్లోలంపై కేంద్రం
- మన ఇంధన భద్రతపై రాజీ లేదు
- పార్లమెంటులో జైశంకర్ ప్రకటన
- సంక్షోభానికి చర్చలే పరిష్కారం
- ఇజ్రాయెల్, ఇరాన్, అమెరికాకు విదేశాంగ మంత్రి సూచన

2లో

# భవిష్యత్ సవాళ్లకు తగ్గట్లుగా మార్చుకోవాలి



- పోలీస్ అధికారులను నేను ఏ,బీ,సీ కేటగిరీలుగా చేసుకున్నా..
- ఎలాంటి పైరవీలకు తావులేకుండా పోస్టింగ్‌లు ఇస్తున్నాం..
- తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026లో ప్రసంగం

హైదరాబాద్: కాలక్రమేణా నేర స్వభావం మారుతోందని, సైబర్ నేరాలు, డ్రగ్స్ సరఫరా వంటి భవిష్యత్ సవాళ్లకు తగ్గట్టుగా పోలీసింగ్‌లోనూ మార్పులు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం చూసేది పోలీసుల వైపేనని, ఏళ్లుగా ప్రజల్లో పోలీసులు పెంచుకున్న విశ్వాసం అలాంటిదన్నారు. అయితే, పోలీస్ శాఖలో ఉద్యోగులు ఆటో మోడ్‌కు వెళితే సమాజానికి అత్యంత ప్రమాదకరమని సీఎం హెచ్చరించారు.

మారుతున్న సాంకేతికత, నేరాలకు తగ్గట్టుగా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్‌గ్రేడ్ కావాలని చెప్పారు. వచ్చే 25 ఏళ్లకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. సోమవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026 కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులనుద్దేశించి

2లో

# రాహుల్ బంధు కింద రేవంత్ రెడ్డి రూ.1000 కోట్లు పంపిస్తున్నారు: కేటీఆర్ ఎద్దేవా

- కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదన్న కేటీఆర్
- ఇప్పుడు కోతల సమయం వచ్చినా రైతుబంధు పడలేదన్న కేటీఆర్
- రుణమాఫీ చేశానని అనుకుంటున్నానని రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరమని వ్యాఖ్య



2లో

# అవి ప్రభుత్వ హత్యలే: షర్మిల

- రాజమండ్రి కల్తీ పాల ఘటనలో 11 మంది మృతి
- ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని షర్మిల తీవ్ర ఆరోపణ
- 11 ఏళ్లుగా లైసెన్స్ లేకుండానే వ్యాపారం జరిగిందని విమర్శ
- మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్
- బాధితులను పరామర్శించని జగన్‌పై కూడా విమర్శలు

# ఏఐ, ఆటోమేషన్‌పై పట్టు పెంచుకోవాలి

న్యూఢిల్లీ: దేశ విద్యా రంగాన్ని వాస్తవిక ప్రపంచ ఆర్థికవ్యవస్థతో అనుసంధానించే ప్రక్రియను మరింత వేగవంతంచేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కృత్రిమ మేధ(ఏఐ), ఆటోమేషన్, డిజిటల్ ఎకానమీ వంటి సబ్జెక్టులపై మరింత దృష్టిపెట్టడం ద్వారా అనుసంధానం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం ఢిల్లీలో జరిగిన పోస్ట్‌బడ్జెట్ వెబినార్‌లో మోదీ మాట్లాడారు. "విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, పర్యాటకం, క్రీడలు, సాంస్కృతిక రంగాలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే మాధ్యమాలు. సంస్థలు, పరిశ్రమల అవసరాలు తీర్చేలా విద్యారంగం మారాలి. అందుకే మార్కెట్ అవసరాలు, వాస్తవిక ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తగ్గట్లుగా నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చాం" అని అన్నారు. "యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) రంగం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలి. ఆవిష్కరణల ఆధారిత ఆర్థికవ్యవస్థకు అనుగుణంగా పరిశ్రమలు, పరిశోధనశాలలతో విద్యాలయాలు అనుసంధానం కావాలి.

# రేవేంద్రపాడులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

- భారీ ర్యాలీ మధ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన విద్యా, ఐటీ శాఖల మంత్రి
- ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు
- కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు

మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు లాంఛనంగా ఆవిష్కరించారు. ఇవాళ రేవేంద్రపాడు చేరుకున్న మంత్రి లోకేశ్ కు స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరిగింది. విగ్రహావిష్కరణ తరువాత అక్కడ ఉన్న ఎన్టీఆర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు లోకేశ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# మనోళ్ల భద్రతే ముఖ్యం

న్యూఢిల్లీ: పశ్చిమాసియా సంక్షోభాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని భారత్ పిలుపునిచ్చింది. ఇజ్రాయెల్, ఇరాన్, అమెరికా తక్షణం ఉద్రిక్తతలకు తెర దించాలని సూచించింది. దేశాల సార్వభౌమాధికారాలను గౌరవించాలని అభిప్రాయపడింది. పశ్చిమాసియా ప్రాంతంలోని దాదాపు కోటి మంది భారతీయుల భద్రతకే తమ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేసింది. దేశ ఇంధన భద్రత, వర్తక, భద్రత ప్రయోజనాలకు పెద్దపీట వేస్తామని పేర్కొంది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సోమవారం పార్లమెంటు ఉభయ సభల్లో ఈ మేరకు ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితిని కేంద్రం నిరంతరం సమీక్షిస్తోందని చెప్పారు. ఇప్పటిదాకా 67 వేల మంది విద్యార్థులను సురక్షితంగా భారత్‌కు తీసుకొచ్చినట్టు వివరించారు. పశ్చిమాసియాలోని భారతీయుల భద్రత నిమిత్తం అక్కడి దేశాధినేతలతో ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే పలుమార్లు మాట్లాడారని గుర్తు చేశారు. "మన ఇంధన భద్రతపై ఆందోళన అనవసరం. ఈ విషయంలో మన వినియోగదారుల ప్రయోజనాలే పరమావధి. వాటిని కాపాడే దిశగా కేంద్రం అన్ని చర్యలూ తీసుకుంటోంది"అని తెలిపారు. "మన ఇంధన భద్రతకు, వర్తకానికి గల్ఫ్ ప్రాంతం కీలకం. ఆ ప్రాంతంతో ఏటా 200 బిలియన్ డాలర్ల మేరకు వాణిజ్యం జరుగుతోంది"అని గుర్తు చేశారు. ఇరాన్‌కు చెందిన నౌక భారత్‌లో ఆశ్రయం పొందేందుకు మానవతా కోణంలో అనుమతించినట్టు జైశంకర్ వెల్లడించారు. "మూడు నౌకలకు ఇరాన్ ఆశ్రయం కోరింది. ఈ మేరకు ఫిబ్రవరి 28న విజ్ఞప్తి చేసింది. కేంద్రం మార్చి 1న అనుమతులు జారీ చేసింది. ఐఆర్ఐఎస్ లావన్ నౌక మాత్రమే మార్చి 4న కోచిలో లంగరు వేసింది"అని చెప్పారు. మిగతా రెండు నౌకల్లో ఐఆర్ఐఎస్ దేనాను మార్చి 4న శ్రీలంక తీరంలో అమెరికా ముంచేయడం తెలిసిందే. అనంతరం మూడో నౌక ఐఆర్ఐఎస్ బుషెర్ శ్రీలంకలోని ట్రింకోమలీ రేవులో లంగరు వేసింది.

**చర్చకు ఖర్గే డిమాండ్**

జైశంకర్ ప్రకటనపై ఉభయ సభల్లోనూ విపక్ష సభ్యులు పెద్దపెట్టున నిరసనలకు దిగారు. ప్రకటనకు ముందే పశ్చిమాసియా సంక్షోభంపై పూర్తిస్థాయి చర్చకు పట్టుబట్టారు. రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ దేశ ఇంధన భద్రతపై స్వల్ప అవధి చర్చకు డిమాండ్ చేశారు. వంట గ్యాస్ ధర పెంపు సామాన్యునిపై భారం మోపిందని ఆయన విమర్శించారు. "పశ్చిమాసియా కల్లోలం తాలూకు ప్రభావం భారత ఇంధన భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వంపైనా పడుతోంది. దేశ ఇమేజీని, ప్రతిష్టను కూడా ఆ యుద్ధం ప్రభావితం చేస్తోంది. కనుక ఈ అంశంపై 176వ నిబంధన కింద చర్చ చేపట్టాలి"అని కోరుతూ నోటీసిచ్చారు. దాన్ని పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటానని చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ వెల్లడించారు. అనంతరం జైశంకర్ ప్రకటన చేసేందుకు అనుమతించారు. అందుకు విపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ వాకౌట్ చేశారు. మంత్రి ప్రకటన చేస్తుండగానే వాకౌట్ చేయడాన్ని సభా నాయకుడు జె.పి.నడ్డా తీవ్రంగా తప్పుబట్టారు. సభలో అరాచక పరిస్థితులు సృష్టించేందుకు కాంగ్రెస్, విపక్షాలు ప్రయత్నిస్తున్నాయంటూ మండిపడ్డారు.


# రేవేంద్రపాడులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమానికి వచ్చిన అభిమానులు, కార్యకర్తలతో ఆయన కాసేపు ముచ్చటించి, వారితో కలిసి ఫోటోలు దిగారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, దుగ్గిరాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కాసరనేని జశ్వంత్, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేశినేని శ్రీఅనిత తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, స్థానికులు తరలిరావడంతో రేవేంద్రపాడులో కోలాహలం నెలకొంది.

# ఇరాన్‌కు తుర్కియే వార్నింగ్..

తుర్కియే అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ ఇరాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ నుంచి వచ్చిన బాలిస్టిక్ క్షిపణిని నాటో రక్షణ వ్యవస్థలు రెండోసారి కూల్చివేశాయని, ఇలాంటి "తప్పుడు, రెచ్చగొట్టే చర్యలు" కొనసాగిస్తూ మధ్యప్రాచ్యాన్ని మళ్లీ గత శతాబ్దంలోలా యుద్ధభూమిగా మార్చేస్తామంటే ఊరుకోమని ఆయన స్పష్టం చేశారు. క్యాబినెట్ సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎర్డోగాన్ మాట్లాడుతూ, ఇరాన్‌కు సంబంధించిన పరిణామాలను తుర్కియే నిశితంగా గమనిస్తోందని తెలిపారు. తమ ఆందోళనలను నేరుగా టెహ్రాన్‌కు తెలియజేశామని చెప్పారు. "ఇరాన్‌కు అవసరమైన హెచ్చరికలు ఇచ్చాం. అయినప్పటికీ వారు తప్పుదోవలోనే కొనసాగుతున్నారు" అని ఎర్డోగాన్ వ్యాఖ్యానించారు. దౌత్యపరమైన పరిష్కారాలకే తుర్కియే ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. "ఇతర యుద్ధాల మాదిరిగానే తుర్కియే న్యాయం వైపు నిలుస్తుంది. చర్చల ద్వారా వివాదాలు పరిష్కరించుకోవడానికే మేము మద్దతు ఇస్తాం" అని తెలిపారు. అదే సమయంలో దేశ రక్షణ సామర్థ్యాలపై కూడా ఎర్డోగాన్ నమ్మకం వ్యక్తం చేశారు. దేశ భద్రత, సార్వభౌమాధికారాన్ని లక్ష్యంగా చేసుకునే ఎలాంటి బెదిరింపులకైనా తగిన ప్రతిస్పందన ఇవ్వగల సామర్థ్యం తుర్కియేకి ఉందని పేర్కొన్నారు. "తుర్కియే ప్రతి రంగంలో బలమైన దేశం. ఎలాంటి దాడినైనా తిప్పికొట్టగలదు" అన్నారు. "మధ్యప్రాచ్యాన్ని శతాబ్దం క్రితం మాదిరిగా మళ్లీ ఆపరేటింగ్ టేబుల్‌పై ఉంచడానికి అనుమతించం" అని ఎర్డోగాన్ హెచ్చరించారు. అలాగే గాజా పరిస్థితిపై మాట్లాడుతూ, గాజాలో జరుగుతున్న ఘటనల నుంచి ప్రపంచ దృష్టిని మళ్లించుకుంటూ ఇజ్రాయెల్ రెండు దేశాల పరిష్కారాన్ని దెబ్బతీయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మధ్యప్రాచ్యంలో యుద్ధం మరింత విస్తరించకుండా త్వరగా ముగియాల్సిన అవసరం ఉందని, లేకపోతే యూరప్-ఆసియాతో పాటు ప్రపంచానికే నష్టం జరుగుతుందని ఎర్డోగాన్ హెచ్చరించారు.



# భవిష్యత్ సవాళ్లకు తగ్గట్లుగా మార్చుకోవాలి

(మొదటి పేజీ తరువాయి).

రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. జరగాలంటే ఆ ప్రాంతంలో శాంతిభద్రతలు బలంగా ఉండాలి. శాంతిభద్రతలు బాగున్న రాష్ట్రాల్లోనే పరిశ్రమలు వస్తాయి.. తద్వారా ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. తెలంగాణలోనూ శాంతిభద్రతలు బాగున్నాయి కాబట్టే ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. దేశం వందేళ్ల స్వాతంత్ర్యదిన వేడుకల నాటికి తెలంగాణ సాంకేతికంగా, అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదగాలి. అందుకు కొత్త విధానాలు తెస్తున్నాం. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి. అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ నగరాన్ని కేవలం 24 గంటల్లో 2 సెం.మీ.వర్షపాతానికి తట్టుకునేలా అన్ని వ్యవస్థలు మనం ఏర్పాటు చేసుకున్నాం. కానీ, కోవిడ్ తర్వాత రెండు మూడు గంటల్లో 40 సెం.మీ.వర్షం వచ్చింది. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా అన్ని వ్యవస్థలు మార్చుకోవాలి.

**సమస్యను అర్థం చేసుకోవాలి..**

పోలీసు విధుల్లో నిరంతరం సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉటుంది. ఎన్నో సమస్యలు పరిష్కరించాలి. అయితే సమస్య పరిష్కారంలో వేగంగా పరిగెత్తితే అది మరింత గందరగోళానికి దారి తీస్తుంది. సమస్యలను అర్థం చేసుకుంటే 50 శాతం పరిష్కారం దొరుకుతుంది. సమస్యను అర్థం చేసుకునేందుకు కింది స్థాయి సిబ్బందికి తగిన సమయం ఇవ్వండి. అధికారుల విద్యార్హత, నైపుణ్యం ఆధారంగా వాళ్లకు డ్యూటీలు ఇస్తే మరింత రాణించే అవకాశం ఉంటుంది. జనాభా ప్రాతిపదికన క్షేత్రస్థాయి అవసరాలకు తగ్గట్టుగా పోలీసులపై పనిభారం, ఒత్తిడి తగ్గించేలా సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలి. ప్రత్యేక అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న గ్రేహౌండ్స్, ఎస్ఐబీ వంటి సంస్థలు తమ లక్ష్యాన్ని దాదాపుగా చేరుకున్నాయి. కూంబింగ్ పోయింది కాబట్టి గ్రేహౌండ్స్‌లో ఉన్న సిబ్బందిని మరోచోట వాడుకోవాలి. విచారణలో సేకరిస్తున్న సమాచారాన్ని ఐసీసీసీలో ఒక డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయండి. పోలీసు అధికారుల పనితీరుకు సంబంధించిన పూర్తి సమాచారం నా దగ్గర ఉంది. దాని ఆధారంగా వాళ్లను నేను ఏ, బీ, సీ కేటగిరీల్లో వర్గీకరించుకుని పెట్టుకున్నా. దానికి అనుగుణంగానే నేను వారికి పోస్టింగ్స్ ఇస్తున్నా. ఈ విషయంలో నేను కరెక్ట్ లేదా తప్పు కావొచ్చు. ఈ రెండేళ్లలో ఎలాంటి పైరవీలు లేకుండా 90 శాతం మందికి ఇలానే పోస్టింగ్‌లు ఇచ్చాం. టీవీల్లో వచ్చే వరకు కూడా ఎవరికి ఎక్కడ పోస్టింగ్ వచ్చిందో తెలియలేదు. పోలీసింగ్‌లో మార్పులు, నూతన చట్టాలు తేవాల్సిన ఆవశ్యకత, ఇతర అంశాలపై చర్చించేందుకు ఏటా డిసెంబర్‌లో పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ నిర్వహించాలి. బడ్జెట్ ప్రవేశపెట్టకముందే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించుకోవచ్చు. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్‌మెంట్, ఇతర సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. వీటిపై విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో అధికారుల కమిటీ నియమిస్తాం. 200102లో అప్పటి డీజీపీ హెచ్‌జే దొర ఆఫీసర్స్ రిట్రీట్ ను ప్రారంభించారని, 24 ఏళ్ల తర్వాత ఆ సంప్రదాయాన్ని మళ్లీ ప్రారంభించినట్టు డీజీపీ బి.శివధర్‌రెడ్డి తెలిపారు.

# అవి ప్రభుత్వ హత్యలే: షర్మిల

రాజమండ్రిలో కల్తీ పాలు తాగి 11 మంది మరణించడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. ఈ మరణాలను ప్రభుత్వ హత్యలుగా అభివర్ణించిన ఆమె, రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం, ఆహార భద్రతా వైఫల్యమే ఈ ఘోరానికి కారణమని ఆరోపించారు. నేడు రాజమండ్రిలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఇది ప్రమాదం కాదని, అధికారుల ఉదాసీనత వల్లే జరిగిందని అన్నారు. వరలక్ష్మి అనే పాల వ్యాపారి దాదాపు 11 ఏళ్లుగా ఎలాంటి లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నా, ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. అధికారులకు తెలియకుండా ఇన్నేళ్లుగా అక్రమ వ్యాపారం ఎలా సాధ్యమైందని ఆమె ప్రశ్నించారు. ఇథిలీన్ గ్లైకాల్ కలిపిన పాలు తాగడం వల్లే పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, కొందరు వెంటిలేటర్‌పై ప్రాణాలతో పోరాడుతున్నారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలు, నెయ్యి, మద్యం, తాగునీరు సహా అన్ని నిత్యావసరాలు కల్తీమయం అవుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజమండ్రి వంటి నగరానికి ఒక్కరే ఫుడ్ సేఫ్టీ అధికారి ఉండటం, ఆయన కూడా స్థానికంగా అందుబాటులో లేకపోవడం సిబ్బంది కొరతకు నిదర్శనమన్నారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నైతిక, పరిపాలనా బాధ్యత వహించాలని షర్మిల డిమాండ్ చేశారు. ఫుడ్ సేఫ్టీ విభాగంలో వెంటనే భారీగా నియామకాలు చేపట్టి, కఠిన తనిఖీలు నిర్వహించాలన్నారు. మృతుల కుటుంబాలకు ప్రకటించిన రూ. 10 లక్షల పరిహారాన్ని రూ. 25 లక్షలకు పెంచాలని కోరారు. బాధితులను మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇప్పటివరకు పరామర్శించకపోవడం సరికాదని అన్నారు. సామాన్య ప్రజల పట్ల ఆయన వైఖరి ఏంటో దీని ద్వారా తెలుస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఆహార భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయకపోతే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం అవుతాయని హెచ్చరించారు.



# రాహుల్ బంధు కింద రేవంత్ రెడ్డి రూ.1000 కోట్లు పంపిస్తున్నారు: కేటీఆర్ ఎద్దేవా

'రాహుల్ బంధు' పథకం కింద ప్రతి సంవత్సరం రూ.1000 కోట్లు ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సిరిసిల్లలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ హయాంలో డిసెంబర్ నెలలో రైతుబంధు పడేదని, కానీ ఇప్పుడు కోతల సమయం వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం వేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో రైతుబంధును నిలిపివేసి 'రాహుల్ బంధు' పేరుతో కొత్త పథకం తెచ్చారని ఎద్దేవా చేశారు. తన పదవిని కాపాడుకోవడం కోసం రేవంత్ రాహుల్ బంధు పథకం కింద గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్ల రూపాయలు ఇస్తున్నాడని ఆరోపించారు. అందుకే కేసీఆర్ ముందే చెప్పారని, ఆలోచించి జాగ్రత్తగా ఓటు వేయాలని సూచించారని తెలిపారు. రేవంత్ రెడ్డి మూడుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారని విమర్శించారు. "నేను రుణమాఫీ చేశానని అనుకుంటున్నా, రైతుబంధు వేశానని అనుకుంటున్నా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల అన్నారని, అసలు ఆయన ముఖ్యమంత్రేనా అని నిలదీశారు. మరి ముఖ్యమంత్రిగా మీరెందుకు ఉన్నారని ప్రశ్నించారు. రైతుబంధు వేస్తే, రుణమాఫీ ఇస్తే మీకు తెలియకుండా ఉండటమేమిటని అన్నారు. హైదరాబాద్‌లో దోమలు బాగా పెరిగిపోయాయని, కానీ నగరంలో చెత్తను మాత్రం తీయడం లేదని విమర్శించారు.

# గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

దీనివల్ల రికార్డులను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని, అధికారులు తప్పు చేసినా ఇట్టే తెలిసిపోతుందని పేర్కొన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని సీఎం పునరుద్ఘాటించారు. ఇందుకోసం పూర్వోదయ పథకం కింద కేంద్రం రూ.30 వేల కోట్లు ఇస్తుందని తెలిపారు. కర్నూలులో డ్రోన్ సిటీ, అనంతపురంలో ఏరోస్పేస్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపిందని, కూటమి ప్రభుత్వం ఛార్జీలు పెంచబోదని హామీ ఇచ్చారు. అలాగే, తిరుపతి లడ్డూ వ్యవహారంపై ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని, శ్రీవారి పవిత్రతను దెబ్బతీసే ఎలాంటి చర్యలనూ సహించేది లేదని చంద్రబాబు హెచ్చరించారు.

# చమురు నిల్వలే లక్ష్యం!

క్షిపణి, అణు కేంద్రాలపై కూడా ఇజ్రాయెల్, అమెరికా తీవ్రస్థాయిలో దాడులను కొనసాగించాయి. దాంతో నతాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలు, పరిసర ప్రాంతాలు పేలుళ్లతో దద్దరిల్లిపోయాయి. ఇస్ఫహాన్‌లోని రివల్యూషనరీ గార్డ్ కమాండ్ కేంద్రాలు, దాని అనుబంధ సంస్థ బసీజ్ ఫోర్స్ ప్రధాన కార్యాలయం భారీగా దెబ్బతిన్నాయి. రాకెట్ ఇంజిన్ల తయారీ కేంద్రంతో పాటు క్షిపణి ప్రయోగ కేంద్రాలను కూడా నేలమట్టం చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. రాజధాని టెహ్రాన్‌తో పాటు పలు నగరాలపై కూడా రోజంతా ఎడతెరిపి లేకుండా క్షిపణులు, బాంబుల వర్షం కురిసింది. ఇందుకు ప్రతిగా ఇరాన్ కూడా గల్ఫ్ దేశాల్లోని చమురు నిల్వలనే లక్ష్యంగా చేసుకుంది. డ్రోన్ దాడుల్లో యూఏఈలో ఒక చమురు కేంద్రానికి భారీగా నిప్పంటుకుంది. బహ్రెయిన్‌లోని ఏకైక చమురు రిఫైనరీ కూడా మంటల్లో చిక్కింది. సౌదీ అరేబియాలో అతి పెద్దదైన షైబా చమురు క్షేత్రంపైనా పలు డ్రోన్ దాడులు జరిగాయి. వాటిని అడ్డుకున్నట్టు సౌదీ ప్రకటించింది. అయినా షైబా వైపు దశలవారీగా డ్రోన్లు దూసుకొస్తున్నట్టు వెల్లడించింది. ఇరాన్ తీరు బాధ్యతారహితమంటూ మండిపడింది. అరబ్ దేశాలపై ఇలాగే దాడులు కొనసాగిస్తే అంతిమంగా అందరికంటే భారీగా నష్టపోయేది ఆ దేశమేనంటూ తీవ్రంగా హెచ్చరించింది. అటు ఇజ్రాయెల్‌పైకి కూడా ఇరాన్ భారీ సంఖ్యలో క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. దాంతో టెల్ అవీవ్, జెరూసలేంతో పాటు దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ప్రజలు బంకర్లలో తలదాచుకుంటున్నారు. దాడుల్లో ఒకరు మరణించగా పలువురు గాయపడ్డారు. ఆదివారం తమపై ఇరాన్ జరిపిన దాడుల్లో మరణించిన ఇద్దరిలో ఒక భారతీయుడు ఉన్నట్టు వచ్చిన వార్తలు నిజం కాదని సౌదీ అరేబియా పేర్కొంది.

**బహ్రెయిన్‌లో 32 మందికి గాయాలు**

యూఏఈ, బహ్రెయిన్, కువైట్, దోహా, ఖతర్ తదితర గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై కూడా ఇరాన్ డ్రోన్ దాడులు భారీ స్థాయిలో కొనసాగాయి. బహ్రెయిన్‌లో ఓ పౌర ఆవాస ప్రాంతం కుప్పకూలడంతో 32 మంది గాయపడ్డారు. వారిలో పలువురు చిన్నారులున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. యూఏఈపై కూడా 15 బాలిస్టిక్ మిసైళ్లు, 18 డ్రోన్లతో ఇరాన్ దాడి చేసింది. తమ దేశంపైకి దూసుకొచ్చిన 17 క్షిపణులు, ఆరు డ్రోన్లను అడ్డుకున్నట్టు ఖతర్ పేర్కొంది. పర్షియన్ గల్ఫ్ తీర సమీపంలో అమెరికా యుద్ధ నౌకలతో పాటు చమురు నౌకలను కూడా లక్ష్యం చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. తమ దేశ గగనతలంలోకి దూసుకొచ్చిన ఇరాన్ ఖండాంతర క్షిపణిని నాటో డిఫెన్స్ వ్యవస్థలు అడ్డుకుని కూల్చేసినట్టు టర్కీ ప్రకటించింది. బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని అమెరికా సైనిక స్థావరంపై డ్రోన్‌ను నిర్వీర్యం చేసినట్టు ఇరాక్ వెల్లడించింది. మరోవైపు లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అక్కడ ఇప్పటిదాకా మరణించిన వారి సంఖ్య 486కు చేరినట్టు లెబనాన్ పేర్కొంది.

**ఎన్నికపై నిరసనలు!**

సుప్రీం నేత పదవిని వారసత్వంగా మొజ్తబాకు కట్టబెట్టడంపై ఇరాన్‌లో పలువురు రాజకీయ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 1979లో వారసత్వ పోకడలపై పోరాడి రాచరికాన్ని కూలదోసి, ఇప్పుడు మళ్లీ అదే దారిలో వెళ్లడం ఏ మేరకు సరైందని వాళ్లు ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఈ వార్తలను కొట్టిపారేస్తోంది. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో ఇరాన్‌కు పూర్తిస్థాయిలో మద్దతుగా నిలుస్తామని రష్యా ప్రకటించింది. నూతన సుప్రీం నేతగా ఎన్నికైన మొజ్తబాకు అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇరాన్‌కు అన్నివిధాలా అండగా ఉంటామని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాల్లో పౌరులపై ఇరాన్ దాడులను జపాన్, ఈజిప్ట్ ఖండించాయి.



# లక్ష్యం.. గ్రామ స్వరాజ్యం!

- బేగంపేటలో 99 రోజుల కార్యాచరణ షురూ..

**రాజపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** రాజపేట మండలం బేగంపేట గ్రామంలో 99 రోజుల కార్యాచరణ గ్రామ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా సోమవారం గ్రామంలో సమావేశం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పలు కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇండ్ల అనుష సుమన్, ఉప సర్పంచ్ బద్దం మధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దేవమని పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు ఒగ్గు కరుణాకర్, జెల్ల భాస్కర్, దేవి సుధాకర్, చిగుర్ల స్వాతి, తులసి ఇందు, నాగారం రామచంద్రం, నీల కనకమ్మ, పేట క్రాంతి, కాసుల శివరాణి, తోట సత్తయ్య గౌడ్ తదితరులు హాజరయ్యారు. గ్రామంలో చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సేవలపై ప్రజాప్రతినిధులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేసి, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించారు.

# ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ

- కుర్రారం ప్రాథమిక పాఠశాలలో ప్రహరీ గోడ పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు



**రాజపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట మండలంలోని కుర్రారం గ్రామ ప్రాథమిక పాఠశాలకు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) ద్వారా మంజూరైన రూ. 5 లక్షల నిధులతో ప్రహరీ గోడ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు భాస్కర్, ఉప సర్పంచ్ రావి కొండల్ రెడ్డి, వార్డు సభ్యులు ఎండి యూసుఫ్, ఎర్రగుంట ప్రభాకర్, మేడి స్వరూప, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచ్ బాల్డ చంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ భూత్కూరి నరసింహారెడ్డి, కత్తుల అంజిరెడ్డి, నీల నరసయ్య, మేడి శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు. గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాఠశాల అభివృద్ధికి మరింత సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరారు.

# అన్నదాత చెంత.. సాగు పాఠాలు!

- గోదారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన అనురాగ్ విశ్వవిద్యాలయ విద్యార్థులు
- ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతు నుంచి అవగాహన



**రాజపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** రాజపేటలోని గోదారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని అనురాగ్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు సోమవారం సందర్శించారు. విశ్వవిద్యాలయ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వి. రవీందర్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉదయభాను ఆధ్వర్యంలో సుమారు 45 మంది విద్యార్థులు ఈ సందర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు ఠాకూర్ స్వరన్ పాల్ సింగ్ తన ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో అనుసరిస్తున్న వివిధ ప్రకృతి వ్యవసాయ విధానాలను విద్యార్థులకు వివరించారు. జీవామృతం, వివిధ రకాల కషాయాల తయారీ విధానం, మొక్కలకు వచ్చే చీడపీడలు, తెగుళ్ల నివారణకు ఉపయోగించే సహజ ద్రావణాల తయారీ, సేంద్రియ ఎరువుల తయారీ విధానాలను ప్రదర్శిస్తూ వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలలో పెరిగే పోషక విలువలు, రైతులకు కలిగే లాభాలు, పర్యావరణానికి, మానవాళికి కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ, దాచేపల్లి శ్రీనివాస్, రాంగళ్ల బాబు తదితర రైతులు పాల్గొన్నారు.

# గ్రామస్థుల చెంతకే రేషన్ సరుకులు

- తాత్కాలిక దుకాణాన్ని ప్రారంభించిన తహసీల్దార్ ప్రదీప్

**రాజపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట మండలంలోని కొండ్రెడ్డి చెరువు గ్రామంలో తాత్కాలిక రేషన్ షాప్‌ను సోమవారం ప్రారంభించారు. తాసిల్దార్ ప్రదీప్, గ్రామ సర్పంచ్ ఉప్పరి నరేష్ కలిసి రేషన్ షాప్‌ను ప్రారంభించారు. ఇప్పటి వరకు రేషన్ సరుకుల కోసం గ్రామస్థులు రెండు కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సి వచ్చేది. గ్రామంలో తాత్కాలిక రేషన్ షాప్ ఏర్పాటుతో ఈ సమస్యకు పరిష్కారం లభించిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



# గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య



**చౌటుప్పల్, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** వంట గ్యాస్ సిలిండర్ ధరల పెంపును కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపు సామాన్య ప్రజలపై మరింత భారాన్ని మోపుతోందని ఆయన విమర్శించారు. సోమవారం చౌటుప్పల్‌లోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో జరిగిన సీపీఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉజ్వల వంటి సంక్షేమ పథకాల విజయాన్ని గొప్పగా చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం, అదే పథకం లబ్ధిదారులపైనా గ్యాస్ ధరలు పెంచడం క్రూరమైన చర్య అని అన్నారు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై రూ.60 పెంపు, వాణిజ్య సిలిండర్‌పై రూ.115 పెంపు చివరికి వినియోగదారులపైనే భారం అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూ ఉండటంతో మధ్యతరగతి, శ్రామిక వర్గాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఈ పరిస్థితుల్లో గ్యాస్ ధరల పెంపు మరింత భారంగా మారుతుందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ పేద ప్రజలపై భారాలు మోపడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానమని ఆయన ఆరోపించారు. గ్యాస్ సిలిండర్లపై పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని వదులుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించడం వారి ప్రజా వ్యతిరేక వైఖరిని వెల్లడిస్తోందని అన్నారు. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులను గ్యాస్ ధరల పెంపుకు కారణంగా చూపడం కేంద్ర ప్రభుత్వ స్వయంకృత అపరాధాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమేనని వీరయ్య విమర్శించారు. దేశ ప్రజల ప్రయోజనాల కంటే అమెరికా ఆధిపత్య ప్రయోజనాలకు మద్దతు ఇవ్వడం మోదీ ప్రభుత్వ విధానాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. ఇంధన ధరల పెంపు ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచుతుందని అన్నారు. ఇది ఇంటి వంట ఖర్చులతో పాటు ఇతర అవసరమైన వస్తువుల ధరలపై కూడా ప్రభావం చూపుతుందని చెప్పారు. ఈ ధరల పెంపును సీపీఎం పార్టీ సామాన్య ప్రజలపై ప్రత్యక్ష దాడిగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, అవ్వారి రామేశ్వరి, నాయకులు బండారు నరసింహ, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, తూర్పునూరు మల్లేశం, ఎండి రేష్మ, భావండ్లపల్లి స్వామి, కందగట్ల ఆనంద్, చిక్కూరు ఈదయ్య, గుణముని ఐలయ్య, మోగుదాల రాములు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలి

- మార్చి 16, 23 తేదీల్లో జరిగే ధర్నాలను జయప్రదం చేయండి
- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. జనార్ధన్



**రాజపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు దేశ కార్మిక వర్గంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని ఐఎఫ్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. జనార్ధన్ అన్నారు. సోమవారం రాజాపేట మండల కేంద్రంలో మార్చి 16 మరియు 23 తేదీల్లో కలెక్టరేట్, హైదరాబాద్ లేబర్ కమిషనరేట్ కార్యాలయాల ముందు నిర్వహించనున్న ధర్నాలకు సంబంధించిన పోస్టర్లను శక్తి హమాలీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని ప్రయత్నిస్తున్నదని, దీని వల్ల కార్మిక వర్గ భవిష్యత్తు, జీవన భద్రత ప్రమాదంలో పడుతుందని విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఈ లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకునే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు మార్చి 16న దేశవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అమరులైన షహీద్ భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ వర్ధంతి సందర్భంగా మార్చి 23న రాష్ట్ర లేబర్ కమిషనరేట్ ముందు భారీ ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు బుగ్గ నరసింహులు, కోయ బాబు, గవ్వల బాలయ్య, బుగ్గ కొమురయ్య, దయ్యాల సిద్ధులు, బండి సిద్ధులు, యమ్మ బాలరాజు, ఎమ్మ బీరయ్య, దయ్యాల రవి, పుప్పాల మల్లయ్య, బైకని భిక్షపతి, మేక ఉపేందర్, కాలే నరసింహులు, కొజ్జిగ వీరయ్య, జూకంటి చంద్రయ్య, కొలిపాక బాలయ్య, బొద్దుల మహేష్, పి. కనకయ్య, యెర్రగోకుల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అతిథి గృహానికి శంకుస్థాపన



- రూ.10 కోట్లతో నిర్మించనున్న గెస్ట్ హౌస్ పనులకు శ్రీకారం
- శంకుస్థాపన చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సూర్యాపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** సూర్యాపేట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న నూతన ప్రభుత్వ అతిథి గృహానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రూ. 10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్లు, భవనాల అతిథి గృహం (గెస్ట్ హౌస్) పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవ్, తహసీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# శ్రీనగర్ కాలనీలో ‘మురికి’ కూపాలు

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు..
- నరకయాతన పడుతున్న నివాసితులు

**సూర్యాపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** సూర్యాపేట మున్సిపాలిటీలోని 16వ వార్డు శ్రీనగర్ కాలనీ పారిశుద్ధ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. కాలనీలోని మురికి కాలువలు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో పూడిక పేరుకుపోయి మురుగు నీరు నిలిచిపోతోంది. ఫలితంగా తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద విపరీతంగా పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఆదర్శ మున్సిపాలిటీగా గుర్తింపు పొందిన పట్టణంలో ప్రస్తుతం పారిశుద్ధ్య నిర్వహణ గాడి తప్పడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకవర్గంలో మార్పులు వస్తున్నా, తమ కాలనీ కష్టాలు మాత్రం తీరడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని కోరుతున్నారు.





# బడిలో బాలల పాలన!

- కొండ్రెడ్డి చెరువు పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం
- ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించిన విద్యార్థులు

**రాజపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట మండలంలోని కొండ్రెడ్డి చెరువు ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తూ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేందర్ తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను పోషిస్తూ పాఠాలను బోధించడంతో పాఠశాలలో ప్రత్యేక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పరి నరేష్, పాఠశాల చైర్మన్ వినోద్, ప్రధానోపాధ్యాయుడు మహేందర్, ఉపాధ్యాయురాలు ప్రజ్ఞ పాల్గొన్నారు.

# కొత్తజాలకు రేషన్ దుకాణం మంజూరు చేయండి

- అదనపు కలెక్టర్ భాస్కర్ రావుకు వినతిపత్రం అందజేత
- కలెక్టరేట్‌లో విన్నవించిన మాజీ సర్పంచ్ ధర్మేందర్ సింగ్


**రాజపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట మండలంలోని కొత్తజాల గ్రామానికి రేషన్ షాప్ మంజూరు చేయాలని కోరుతూ సోమవారం అదనపు కలెక్టర్ భాస్కర్ రావుకు వినతి పత్రం అందజేశారు. కొత్తజాల గ్రామ మాజీ సర్పంచ్ ఠాకూర్ ధర్మేందర్ సింగ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చెప్పాల మహిపాల్ కలిసి అదనపు కలెక్టర్‌ను కలిసి గ్రామానికి రేషన్ షాప్ అవసరాన్ని వివరించారు. అనంతరం పౌరసరఫరాల జిల్లా అధికారి రోజా రాణికి కూడా వినతి పత్రం అందజేశారు. గ్రామంలో రేషన్ షాప్ మంజూరు అంశంపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


# లారీ ఢీకొని మేస్త్రి దుర్మరణం

- రోడ్డు దాటుతుండగా ప్రమాదం.. చౌటుప్పల్‌లో విషాదం



**చౌటుప్పల్, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఓ మేస్త్రి ప్రాణాలు కోల్పోయిన ఘటన చౌటుప్పల్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చిట్యాల మండలం పిట్టంపల్లికి చెందిన ఈసం సత్తయ్య (43), చౌటుప్పల్‌లోని రాంనగర్ కాలనీలో నివసిస్తూ మేస్త్రి పని చేసుకుంటున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకుని తంగడపల్లి నుంచి ఆటోలో చౌటుప్పల్‌కు చేరుకున్నాడు. తంగడపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఆటో దిగి కాలినడకన రోడ్డు దాటుతుండగా.. చిట్యాల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం (టీఎస్ 07యూజీ 9396) అతివేగంగా వచ్చి అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్తయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి అన్న ఈసం బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

# ఆటోను ఢీకొట్టిన డీసీఎం.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

- నరేష్ అక్కడికక్కడే మృతి.. సురేష్ ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయాడు
- తీవ్రంగా గాయపడిన కేతమ్మ మార్గమధ్యలో మృతి
- తిమ్మాపురం గ్రామంలో విషాద ఛాయలు

**యాదాద్రి భువనగిరి, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** భువనగిరి - జగదేవ్‌పూర్ ప్రధాన రహదారిపై వడపర్తి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన డొంకెన నరేష్, సురేష్, కేతమ్మ ముగ్గురు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్ అక్కడికక్కడే మృతి చెందగా, సురేష్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. అలాగే తీవ్రంగా గాయపడిన కేతమ్మను హైదరాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిసింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో తిమ్మాపురం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పోలీసులు తెలిపారు.

# మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక నిఘా

- పాఠశాలల్లో ఆహారం నాణ్యత, పరిశుభ్రతపై కట్టుదిట్టమైన తనిఖీలు అవసరం
- అధికారులే స్వయంగా రుచి చూడాలి: కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి భువనగిరి, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్, ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం నాణ్యతపై ప్రత్యేక అధికారులు పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 691 ప్రభుత్వ మరియు రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రత్యేక అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షించాలని తెలిపారు. సంబంధిత పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, ఆహారం నాణ్యత, పరిశుభ్రత, మెనూ ప్రకారం వంట జరుగుతోందో లేదో పరిశీలించడంతో పాటు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం ప్రతిరోజూ అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని అన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో వంట సరుకులు, కూరగాయలు నాణ్యతతో ఉండాలని, వంటగదులు పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు సక్రమంగా అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సమర్థవంతంగా అమలయ్యేలా ప్రత్యేక అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు.

# మమ్మల్ని గుర్తించండి.. మా కష్టాలను ఆలకించండి!

- కలెక్టరేట్‌లో ఉద్యమకారుల వినతి
- హైకోర్టు తీర్పు అమలు చేయాలని విన్నపం



**యాదాద్రి భువనగిరి, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ఉద్యమకారులకు న్యాయం చేసి, వారిని అధికారికంగా గుర్తించాలని కోరుతూ ఉద్యమకారులు సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆనాటి సమైక్య పాలనలో అనేక కేసులు ఎదుర్కొన్నప్పటికీ, పోలీసుల రబ్బర్ బుల్లెట్లు, బాష్ప వాయువు, లాఠీ ఛార్జీలు, జైలు నిర్బంధాలను భయపడకుండా ఉద్యమం కొనసాగించామని తెలిపారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అలాగే తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు సంగిశెట్టి క్రిస్టఫర్, సంగిశెట్టి జనార్ధన్, గడ్డమీది పరశురాములు, కొండకింది నరేందర్, మందడి రవీందర్ రెడ్డి, చిందం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ హయాంలో మహిళలపై దురాగతాలు జరిగాయి: మంత్రి సవిత

- మహిళల సంక్షేమంలో చంద్రబాబు ప్రభుత్వం ముందంజలో ఉందని వ్యాఖ్య
- వైసీపీ హయాంలో మహిళలపై అనేక దురాగతాలు జరిగాయని విమర్శ
- ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్లతో మహిళలకు అండగా ప్రభుత్వం
- రాయలసీమ అభివృద్ధిని అడ్డుకున్నది వైసీపీ పాలనే అని ఆరోపణ
- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రతిపక్షం అసహనం వ్యక్తం చేస్తోందని వ్యాఖ్య

**పెనుకొండ/శ్రీసత్యసాయి, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** వైసీపీ హయాంలో మహిళలపై అనేక దురాగతాలు, దుర్వినియోగాలు చోటుచేసుకున్నాయని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత విమర్శించారు. సోమవారం పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. మహిళల సాధికారత కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. దీపం పథకం ద్వారా సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, “తల్లికి వందనం” వంటి పథకాలతో మహిళలకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఎంఎస్ఎంఈ పార్కుల్లో అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. శాసనసభలో తల్లిలాంటి భువనేశ్వరిని అవమానించారని ఆరోపిస్తూ మహిళలను గౌరవించని వ్యక్తికి సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత లేదని అన్నారు. వైసీపీ




పాలనలో మహిళలపై జరిగిన ఘటనలపై అప్పట్లోనే గవర్నర్‌కు నివేదిక అందజేశామని తెలిపారు. రాయలసీమ అభివృద్ధి విషయంలో కూడా జగన్‌కు మాట్లాడే హక్కు లేదని మంత్రి సవిత విమర్శించారు. గత ఐదేళ్లలో రాయలసీమలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా నిర్మించలేదని, చెరువులను నీటితో నింపలేదని అన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాయలసీమను హార్టికల్చర్ హబ్, పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రతిపక్షం అసహనం వ్యక్తం చేస్తోందని, ప్రజలు ఇప్పటికే వారి రాజకీయాలను తిరస్కరించారని మంత్రి సవిత పేర్కొన్నారు.

# ఆర్‌డీటీని రక్షించుకుందాం.. అనంతపురాన్ని కాపాడుకుందాం

- ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి
- లక్ష పోస్టుకార్డుల ఉద్యమాన్ని జయప్రదం చేయాలని పిలుపు
- డా. తలారి రంగయ్య ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ

**కళ్యాణదుర్గం, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** పేదల సేవే లక్ష్యంగా పనిచేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ) సంస్థను రక్షించుకోవాలని, అనంతపురం జిల్లా అభివృద్ధిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త డా. తలారి రంగయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన సమావేశంలో ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. ఆర్‌డీటీ సంస్థ పేదలు, బడుగు బలహీన వర్గాలు, గిరిజనుల అభివృద్ధికి ఎన్నో సేవలు అందిస్తోందని తెలిపారు. వేల సంఖ్యలో పేదలకు ఉచిత ఇళ్లు నిర్మించి అందించడం, ఉన్నత వైద్య సేవలు కల్పించడం, విద్యా రంగంలో సహాయం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో నివసించే చెంచు గిరిజనుల అభివృద్ధికి



ఆర్‌డీటీ ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు. వారి జీవనోపాధి మెరుగుపరచడానికి మేకలు, గొర్రెలు, పాడి పశువులు, రుణ సదుపాయాలు అందించడంతో పాటు కుట్టు యంత్రాల శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. గిరిజన రైతులకు ఎద్దులు, విత్తనాలు, ఎరువులు అందించడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం, గర్భిణులు మరియు బాలింతలకు పోషకాహారం అందించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. 1969లో స్పెయిన్ దేశానికి చెందిన ఫాదర్ ఫెర్రర్ భారతదేశానికి వచ్చి పేదల పరిస్థితిని చూసి చలించి అనంతపురం జిల్లాలో ఆర్‌డీటీ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. అనంతరం ఆయన కుమారుడు మాంచో ఫెర్రర్ ఆ సేవలను మరింత విస్తరింపజేసినట్లు పేర్కొన్నారు. ఆర్‌డీటీ సంస్థకు సంబంధించిన ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ కోసం లక్ష పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఉద్యమంలో భాగంగా కుందుర్పి మండల కేంద్రంలోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా అప్రమత్తంగా ఉండాలి

- నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా పని చేయాలి
- మల్లన్నసాగర్ - ఘన్‌పూర్ పనులు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** రానున్న వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం మినీ మీటింగ్ హాల్‌లో జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితులపై ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, హెచ్‌ఎండబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ నుండి ఘన్‌పూర్ వరకు రూ.210 కోట్లతో మంజూరైన తాగునీటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని



సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అధికారులు అంకితభావంతో పనిచేయాలని అన్నారు. త్రాగునీటి సరఫరా కోసం మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఏదైనా ప్రాంతంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు కనిపిస్తే ముందస్తుగానే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న చేతి పంపులు, సింగిల్ ఫేజ్ మోటర్లు, త్రీఫేజ్ మోటర్లు, ఓపెన్ వెల్స్ అన్నీ పనిచేసే విధంగా చూసుకోవాలని ఆదేశించారు. నీటి సరఫరాను మెరుగుపర్చేందుకు చేపడుతున్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేసవి సీజన్‌లో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే స్పందించి చర్యలు తీసుకునేలా అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్.ఈ కృష్ణయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కరుణాకరన్, పబ్లిక్ హెల్త్ ఎస్.ఈ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎండబ్ల్యూఎస్ బీజీఎం శశాంక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## చదువుకు పేదరికం అడ్డంకి కావొద్దు

- వైద్య విద్యార్థినికి ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ 'అభయం'
- ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్న నాగలక్ష్మికి రూ.20 వేల ఆర్థిక సహాయం

**సంస్థాన్ నారాయణపురం/చౌటుప్పల్, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** పేదరికం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ సహాయక చర్యలు కొనసాగిస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న వైద్య విద్యార్థినికి ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ ఆర్థిక సహాయం అందించి ఆదర్శంగా నిలిచారు. సర్వేలు గ్రామానికి చెందిన కట్టెల మల్లేష్ కుమార్తె కట్టెల నాగలక్ష్మీ ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎస్.వి.ఎస్ మెడికల్ కళాశాలలో డెంటల్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చదువులో ప్రతిభ కనబరుస్తున్న నాగలక్ష్మీ కుటుంబం ఆర్థికంగా వెనుకబడిన నేపథ్యంలో కళాశాల ఫీజు చెల్లించడం కష్టంగా మారింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ స్పందించి ఆమె చదువుకు ఆటంకం కలగకుండా ఉండేందుకు రూ.20,000 నగదును ఫీజు నిమిత్తం ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. పేదరికం కారణంగా విద్యార్థుల చదువు ఆగిపోవడం సమాజానికి నష్టమని అన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మానుకోవాల్సిన పరిస్థితి రాకూడదని, అలాంటి వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే విద్యను ఆయుధంగా చేసుకుని భవిష్యత్తులో సమాజానికి, ముఖ్యంగా నిరుపేద ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఇలాంటి సహాయక కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని భాస్కర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు, గ్రామస్తులు భాస్కర్ సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం



**నకిరేకల్, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** వలిగొండ - రామన్నపేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్, వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి సోమవారం నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీకి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దానయ్య గౌడ్, కర్నాటి లింగస్వామి, చంద్రయ్య, దామోదర్ రెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి సర్పంచ్ భరోసా

- అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత



**రామన్నపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** మండల కేంద్రానికి చెందిన కొండే రాములమ్మ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ ఆమె నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి ఆర్థిక పరిస్థితిని గమనించి, దహన సంస్కారాల నిమిత్తం తన వంతుగా ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బండ లింగస్వామి, మోటే మహేష్, నాయకులు నసర్, నరసింహ, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరుని కళ్యాణం

- ఏర్పాట్లలో నిమగ్నమైన దేవాలయ కమిటీ..
- పరిశీలించిన చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** చౌటుప్పల్ మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమ ఏర్పాట్లను చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ పరిశీలించారు. ఈ నెల 15వ తేదీన జరగనున్న స్వామివారి కళ్యాణ మహోత్సవం ప్రాంగణాన్ని దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవాలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను పొందాలని కోరారు. కార్యక్రమానికి వచ్చే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవాలయ కమిటీ ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిశీలనలో స్థానిక కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ గౌడ్, ఏఎంసి డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

- పెండింగ్ లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

**యాదాద్రి భువనగిరి, మార్చి 9 (తొలివెలుగు న్యూస్) :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 46 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీలలో రెవెన్యూ శాఖకు 24, గ్రామీణాభివృద్ధి శాఖకు 5, మున్సిపాలిటీకి 4, హౌసింగ్ శాఖకు 2, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు 2, డివిజనల్ పంచాయతీకి 2 దరఖాస్తులు వచ్చాయి. అదేవిధంగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా సంక్షేమ, ఎస్‌డీసీ,



ఇరిగేషన్, ఆర్టీసీ, విద్యా, రోడ్లు మరియు భవనాల శాఖలకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలపై భారాలు.. మోదీ చోద్యం!

- అమెరికా యుద్ధోన్మాదంపై ప్రధాని నోరు విప్పాలి
- ఇజ్రాయెల్ దాడులను ప్రధాని ఎందుకు ఖండించడం లేదు?
- కేంద్రానిది ప్రజా వ్యతిరేక విధానం: సిపిఎం నేత ఎస్. వీరయ్య

**రామన్నపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** ఇరాన్‌పై ఇజ్రాయిల్ - అమెరికా దాడిని ఖండించకుండా భారత ప్రజలపై భారాలు మోపుతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వైఖరి సరైంది కాదని, దీనిపై ప్రపంచానికి సమాధానం చెప్పాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య డిమాండ్ చేశారు. రామన్నపేటలోని సిపిఎం మండల కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆయుధ సంపత్తితో చమురు నిక్షేపాలున్న దేశాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా ఆడుతున్న రాజకీయ నాటకంలో భాగంగా ఇజ్రాయిల్ ఇరాన్‌పై యుద్ధోన్మాదంతో అమాయక ప్రజలను చంపుతుంటే, "విశ్వ గురు" అని చెప్పుకునే భారత ప్రధాని మౌనంగా చూస్తున్నారని విమర్శించారు. ఈ యుద్ధ ప్రభావం భారత ప్రజలపై పడుతూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ద్వారా సామాన్యులపై భారాలు మోపుతున్నాయని ఆయన అన్నారు. అంతేకాకుండా భారత ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని తెలిపారు. మోడీ ఇజ్రాయిల్ పర్యటన ముగిసిన రెండు రోజులకే ఇరాన్‌పై యుద్ధం




ప్రారంభం కావడం ప్రపంచ దేశాలను భారత్ వైపు ప్రశ్నార్థకంగా చూడేలా చేస్తోందని పేర్కొన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టి చీకటి వాణిజ్య ఒప్పందాలతో భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాలపై ప్రధాని మోడీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆందోళనలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలందరూ ఈ ఆందోళనల్లో పాల్గొని మోడీ ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా గొంతు విప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బల్గూరి అంజయ్య, వనం ఉపేందర్, సీనియర్ నాయకులు ఏభూషి నర్సింహా, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గన్నెబోయిన విజయభాస్కర్, గొరిగె సోములు, భావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, ఎండి రషీద్, బోడిగె రజిత, గంటేపాక శివకుమార్, మునికుంట్ల లెనిన్, శానకొండ రామచంద్రం, గుణగంటి మల్లేశం, పల్లె సత్యనారాయణ, జల్లెల మల్లేశం పాల్గొన్నారు.

## రామన్నపేట దవాఖానాపై సర్కారు నిర్లక్ష్యం వీడాలి





- రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలకు పెంచాలి
- 16 నుంచి 'నిరవధిక' పోరు.. రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

**రామన్నపేట, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రూ.40 కోట్లు కేటాయించి నూతన భవనం నిర్మించాలని సిపిఎం జిల్లా నాయకులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జిల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రహదారి బంగ్లాలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు 60 సంవత్సరాల క్రితం ఏర్పడిన రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి పాత నియోజకవర్గ కేంద్రంగా సుమారు 8 మండలాల ప్రజలకు వైద్య సేవలు అందించిందని తెలిపారు. ప్రస్తుతం కనీస సౌకర్యాలు లేకపోవడంతో పేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని విమర్శించారు. దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం పాతబడి, పైకప్పు వెచ్చులూడి రోగులపై పడే ప్రమాదం ఉందని అన్నారు. అత్యవసర వైద్య సేవలు అందక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక వైద్య పరికరాలు లేకపోవడంతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో రూ.40 కోట్లు కేటాయించి నూతన భవనం నిర్మించి, ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### 16 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు

ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16వ తేదీ నుంచి సిపిఎం ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించే వరకు దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ ప్రజా పోరాటానికి మండల ప్రజలు మద్దతు తెలిపి కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు రెబ్బాస్ రాములు, టీడీపీ మండల నాయకులు ఫజల్ బేగ్, సిపిఐ నాయకులు రచ్చ యాదగిరి, ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు వనం ఉపేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గొరిగె సోములు, గన్నెబోయిన విజయభాస్కర్, ఎండీ రషీద్, భావండ్లపల్లి బాలరాజు, బోడిగె రజిత, పట్టణ శాఖ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆవనగంటి స్వామి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, దుబ్బాక సర్పంచ్ గట్టు నర్సింహా, పల్లె సత్యం, మేడి గణేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానగొండ రామచంద్రం, శాఖ కార్యదర్శులు గోగు లింగస్వామి, శానగొండ వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**ఆదిలాబాద్ మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** మహిళల అభ్యున్నతికి ప్రభు త్వం అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తుందని జిల్లా కలెక్టర్ రా జర్షిషా అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గా ర్డెన్స్‌లో అంతర్జాతీయ మహి ళా దినోత్సవ వేడుకలను అ త్యంత వైభవంగా నిర్వహిం చారు. మహిళా, శిశు, దివ్యాం గుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వ లన చేసి ప్రారంభించారు. ముందుగా వివిధ వ్యాపార రంగాల్లో రాణిస్తున్నమహిళల ద్వారా ఏర్పాటుచేసిన స్టాళ్ల ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మా ట్లాడుతూ, ముఖ్యంగా వైద్యా రోగ్య, విద్యా, పోలీసు, అంగ న్వాడీ రంగాల్లో మహిళలు అందిస్తున్న సేవలను కొనియా డారు. అంగన్‌వాడీ సూపర్వై జర్లు బాల్య వివాహాలను అరి కట్టడంలో చూపుతున్న చొర వను ప్రత్యేకంగా అభినందిం చారు. మహిళల ఆర్థికాభివృ ద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టి న మహాలక్ష్మి, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథ కా లు వారి ఆత్మగౌరవాన్ని పెం పొందిస్తాయని వివరించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని మహిళలకు మెరుగైన వైద్యం అందించడంపై దృష్టి సారించా లని, ముఖ్యంగా సర్వైకల్, రొ మ్ము క్యాన్సర్ వంటి వ్యాధు లపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం నుండి ప్రారంభమై న ఎచ్ పి వి వ్యాక్సినేషన్ కా ర్యక్రమాన్ని జిల్లాలోని 14 నుం డి 15 ఏళ్ల బాలికలందరికీ వి జయవంతంగా పూర్తి చేయా లని సూచించారు. మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తు న్న




మిల్లెట్ యూనిట్లు, కోల్డ్ ప్రె స్డ్ ఆయిల్ తయారీ, జూట్ బ్యాగుల తయారీ వంటి స్వ యం ఉపాధి రంగాల్లో మహిళ లు రాణించడం సంతోషకర మని అన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న వి వక్షను అరికట్టి, వారికి పురు షులతో సమానంగా అవకాశా లు కల్పించినప్పుడే 'వికసిత భారత్', 'తెలంగాణ రైజింగ్ 2047' కల సాకారమవుతుం దని ఆకాంక్షించారు. ముని సి పల్ చైర్ పర్సన్ బండారి అ నూష మాట్లాడుతూ, ప్రస్తుత తరుణంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇం టికే పరిమితం కాకుండా ఆరో గ్యం పట్ల ద్రుష్టి సారించాల న్నారు. తోటి మహిళలు కష్టా ల్లో ఉన్నప్పుడు వారికీ మనో ధైర్యాన్ని ఇస్తే మరింత ఎదుగు తారని ఆశాభావం వ్యక్తం చే శారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణించి వివిధ అ వార్డులు పొందిన పెందూర్ శాంత బాయి, కుమార బాగు బాయి, మర్సుకోల కళావతి, రామ బాయి ఆదివాసీ మహి ళలను కలెక్టర్, మునిసిపల్ చైర్ పర్సన్ శాలువాతో సత్క రించి మెమొంటో అందజేశా రు.అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంద ర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన మహాలకు కలెక్టర్, మున్సి పల్ చైర్ పర్సన్ బహుమ తు లను అందజేసి, సంతకాల సేకరణ బోర్డుపై ఆయన సం తకం చేశారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి మి ల్కా, ఎస్సి అభివృద్ధి అధికారి సునీతకుమారి, కలెక్టరేట్ ఏ వో వర్ణ, మహిళా కౌన్సిలర్లు, ఐసిడిఎస్ అధికారులు, అంగ న్వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, మహి ళలు పాల్గొన్నారు.



## పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ

- ఎల్ఐసీ ఇన్సూరెన్స్ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో కార్యక్రమం




**చౌటుప్పల్, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ), ఇన్సూరెన్స్ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థులకు నిత్యం ధరించే దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డి.ఎస్.పి పటోళ్ల మధుసూదన్ రెడ్డి, ఎల్ఐసీ చౌటుప్పల్ శాఖ ఏబీఎం సత్యనారాయణ, భాస్కర్ రావు, అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, మండల విద్యాధికారి ఎలికట్టె గురువారావు హాజరై విద్యార్థులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి విద్యా బోధన జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. ఎల్ఐసీ ఏబీఎం సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని పాఠశాలకూ, తల్లిదండ్రులకూ మంచి పేరు తీసుకురావాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని మాట్లాడుతూ.. దాతృత్వం లేనివారే నిజమైన పేదవారని, సంపాదనతో పాటు సహాయం చేసే గుణం కూడా ఉండాలని అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో పాఠశాలలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిటీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్ణ శివకుమార్, కార్యక్రమ సమన్వయకర్త కూరెళ్ల సత్యనారాయణ, భాస్కర్, నరసయ్య, రాంబాబు, నాగమణి, జానకి, హేమలత, మాధవరెడ్డి, భాగ్యశ్రీ, శ్రవణ్ కుమార్, జనార్దన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శోభ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, స్టేషనరీ పంపిణీ

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ చేయూత అందించాలి
- డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, చైర్‌పర్సన్ మోగుదాల పావని



**చౌటుప్పల్, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఓరగంటి శ్రీనివాస్ గౌడ్ సమకూర్చిన పరీక్ష ప్యాడులు, పెన్నులు, పెన్సిల్లు కార్యక్రమంలో వారు పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులు రాబోయే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తున్న ఓరగంటి శ్రీనివాస్ గౌడ్‌ను వారు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## నల్గొండ ఎక్స్‌రోడ్ ఫ్లైఓవర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

**ఇద్దరు బస్సు డ్రైవర్లు మృతి**

**క్లీనర్‌కు తీవ్ర గాయాలు**

**నార్కెట్‌పల్లి/ నల్గొండ, మార్చి 9 (తొలువెలుగు న్యూస్) :** హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై నల్గొండ ఎక్స్‌రోడ్ ఫ్లైఓవర్ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బస్సు డ్రైవర్లు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం, ఓవర్‌టేకింగ్ సమయంలో ఒక బస్సు, లారీ స్వల్పంగా ఢీకొనడంతో రెండు వాహనాల డ్రైవర్లు వాహనాలను ఆపి రోడ్డుపై మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో అతివేగంగా వచ్చిన మరో లారీ నిలిపి ఉన్న వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనాల మధ్యలో ఉన్న మోజో ట్రావెల్స్ బస్సు డ్రైవర్లు శ్రీనివాస్, బంగారయ్యలు అక్కడికక్కడే మృతి చెందారు. బస్సు క్లీనర్ సురేష్ తీవ్రంగా గాయపడగా, అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## మహిళా సర్పంచ్.వార్డ్ సభ్యులు, పారిశుధ్య కార్మికు లకు చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దంపతులువెడ్మ దృపద బొజ్జు పటేల్

**ఖానాపూర్ మార్చి 9 (తొలివెలుగు న్యూస్): :** ఖానాపూర్ నియోజకవర్గం లోని ఉట్నూర్ మండల కేంద్ర ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో ఘనంగా ఆదివారం రాత్రి మహిళా ది నోత్సవం జరిగింది ఉట్నూర్ మండల మహిళా సర్పంచ్ లు , వార్డ్ మెంబెర్స్ , గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు , మహి ళా కార్యకర్తలకు ఖానాపూర్ ఎమ్మెల్యే దంపతులు వెడ్మ దృపద బొజ్జు పటేల్ లు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు వురు మహిళా నాయకులు ఎ మ్మెల్యే పైన పాట పాడారు. మహిళలకు ప్రభుత్వం చేస్తు న్న కార్యక్రమాలను గు ర్తుచేసుకున్నారు. ఈ సంద ర్భంగా మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ పురు షులతో సమానంగా మహిళ లు విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో రాణించాలని అన్నా రు. మహిళలు ధైర్యంగా అన్ని రంగాల్లో రాణించి నప్పుడే స మాజంలో గుర్తింపు వస్తుంద ని, పురుషులు కూడా ఎ సంద ర్భంలోనైనా మహిళలను గౌర వించి అవకాశాలు కల్పించాలని అన్నారు. మహిళలందరూ ఎమ్మెల్యే దంపతులకు శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సర్పంచ్ లు , వార్డ్ సభ్యులు , పారిశుధ్య కార్మికు లు , కాంగ్రెస్ మహిళా నాయ కులు , కార్యకర్తలు తదితరు లు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు పటిష్ఠ చర్యలు: కలెక్టర్ కె. హరిత

**ఆసిఫాబాద్ మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** జిల్లా కేంద్రం: ఎన్నికలలో ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రంగా ఉంచడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె. హరిత సోమవారం తెలిపారు.

జిల్లా కేంద్రంలోని ఈ.వి.ఎం. గోదాం అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం. డెవిడ్ మరియు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. కలెక్టర్ ప్రకారం, గోదాం వద్ద 24 గంటలపాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తారు మరియు 24 గంటల పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు శ్యాంలాల్, ముసాఫిర్ హుస్సేన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వంట గ్యాస్ ధర తగ్గించాలని నిరసన

- మందోల్లగూడెంలో ఆందోళన కార్యక్రమం
- కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి

**చౌటుప్పల్, మార్చి 9 (తొలివెలుగు న్యూస్):** వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ చౌటుప్పల్ మండలం మందోల్లగూడెం గ్రామంలో సిపిఎం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు బీజేపీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఏటా కోటి ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. అదేవిధంగా రైతులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన వాగ్దానాన్ని కూడా అమలు చేయలేదని తెలిపారు. గతంలో వంట గ్యాస్ ధర రూ.450 ఉండగా ప్రస్తుతం రూ.1050కు పెరిగిందని, ఇది సామాన్య ప్రజలపై భారీ భారమని పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం తీవ్ర




ఇబ్బందులు పడుతున్నారని, యూరియా సరఫరాను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకురావడం రైతులకు సమస్యగా మారిందని అన్నారు. తక్షణమే యూరియా ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి రైతులకు సులభంగా అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ పేద ప్రజలపై భారాలు మోపుతున్న ప్రభుత్వ విధానాలు ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు కొండే శ్రీశైలం, సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ వార్డు సభ్యుడు యాట ముత్యాలు, కొండే అంజయ్య, ఎస్ఎఫ్ఐ మండల సీనియర్ నాయకుడు కందటి వంశి రెడ్డి, ఎస్ఎఫ్ఐ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇట్టబోయిన శివ, కార్యదర్శి చేనబోయిన చరణ్, డివైఎఫ్ఐ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండే నవీన్, నాయకులు కందకట్ల శివ, కొండే శ్రీను, గొర్రె శ్రీనివాస్ రెడ్డి, మంద నర్సిరెడ్డి, గుడిసె మల్లేశం, నీలా జంగులు, ఎండీ ఉస్మాన్, గొరిగె లింగయ్య, నరసింహ, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.